క్లుప్తంగా

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా



బ్యాడ్మింటన్ ఆడుతున్న బాలురు

నగరి: గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా పోటీలు నగరి మండల, మున్సిపల్ ప్రాంతాల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. పీసీఎన్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం బాలుర, బాలికల బ్యాండ్మింటన్ పోటీలు నిర్వహించారు. గ్రామస్థాయిలో గెలుపొందిన జట్లకు మండలస్థాయిలో పోటీలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



అభయాంజనేయ స్వామి

నగరి: పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస శనివారం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి చేసిన అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు దుర్గాప్రకాష్ తీర్థ ప్రసాదాలు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం పంపిణీ



పుత్తూరు ఎన్జీఓ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం పంపిణీ చేస్తున్న దాతలు

పుత్తూరు: పట్టణంలోని ఎన్జీఓ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ పిల్లలకు, గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మె చేస్తున్న కారణంగా పిల్లలు ఇబ్బంది పడకూడదని భోజనం తయారు చేయించి అందించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వంతో జరుగుతున్న చర్చల్లో అంగన్‌వాడీ ప్రతినిధులు మొండి వైఖరిని విడనాడాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సమ్మెను విరమించాలని ఆయన కోరారు.

వలంటీర్లతో సమీక్ష

పాలసముద్రం: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా బాధ్యతగా అందించాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి, తహసీల్దార్ బాబు తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో మండల పరిధిలోని వలంటీర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. అందువల్ల ప్రభుత్వ పథకాలను వలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాలకు బాధ్యతగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ ఇకనుంచి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీ కూడా వలంటీర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ విద్యావతి, విస్తరణాధికారి రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



రామసముద్రంలో జరుగుతున్న మురుగు కాలువల నిర్మాణ పనులు

పుత్తూరు: మండల పరిధిలోని రామసముద్రం గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని గ్రామ సర్పంచ్ డి.కుమార్‌స్వామి తెలిపారు. ఇటీవల గ్రామంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు, గ్రామంలో మురుగు కాలువలను నిర్మించాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి రోజా సంబంధిత అధికారులతో సంప్రదించి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. సమస్యల పరిష్కారంపై తక్షణం స్పందించిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



కుమార్



ప్రకాష్

పాలసముద్రం: మండలంలోని ఎమ్మార్సీలో శనివారం ఎస్టీయూ నూతన కార్యవర్గం కమిటీ ఎంపిక జరిగింది. మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా కే.కుమార్, ప్రధాన కార్యదర్శిగా కే.ప్రకాష్, ఆర్థిక కార్యదర్శిగా టి.ఆనందయ్య, గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

అన్ని వార్డుల్లో సమాన అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి: అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శనివారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. డీఈ నరేష్ ఆదేశానుసారం మున్సిపల్ సిబ్బంది సమావేశ అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉన్నా తెలపాలంటూ మున్సిపల్ చైర్మన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ బాలన్, విప్ దయానిధి హౌసింగ్ కేటాయించిన వారిలో ఇంకా గృహనిర్మాణాలు చేపట్టని వారు, ఇచ్చిన ప్రాంతం వద్దని మరో చోట కావాలని కోరిన వారి కారణంగా ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను తెలపాలని హౌసింగ్, టీపీబీఓ, రెవెన్యూ అధికారులను కోరారు. ఆ స్థలాలను ప్రస్తుతం స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయిస్తే వారైనా నిర్మాణాలు చేపడుతారన్నారు. దీనిపై అధికారులు సమాధానం ఇస్తూ జాబితాను తాము అందిస్తామన్నారు. కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ ఇటీవల అధిక వర్షాలకు కుశస్థలి నదిపై నీరుపారడంతో రోడ్డు దెబ్బతిందని దానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ నదిపై నూతన వంతెన మంజూరైందని సాంకేతికపరమైన పనులు పూర్తి చేసుకోవాల్సి ఉందని అప్పటి వరకు ఉన్న వంతెనకు మరమ్మతులు చేపడతామన్నారు. మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇటీవలే సుమారు రూ.2 కోట్ల మేర సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించగా అవి వేగంగా జరుగుతోందన్నారు. ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేస్తూ వెళ్తున్నామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు..

- సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నీరు పంపింగ్ చేయ దానికి విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ. 3.94 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టడం
- విద్యుత్ దీపాల నిర్వహణకు సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయింపు
- 6వ వార్డులో రూ.24 లక్షల వ్యయంతో శ్మశానంలో టాయిలెట్లు, ఉత్తరక్రియల షెడ్డు నిర్మాణం
- కాకవేడులో రూ.10 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు నిర్మాణం
- రూ.40 లక్షల వ్యయంతో మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో సిమెంటురోడ్ల నిర్మాణం

భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



సంకష్టహర వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీసిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం రాత్రి సంకష్టహర చతుర్థి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం మహిళల చేత సంకష్టహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. బిల్వ పత్రాలు, తెల్లజిల్లేడు పువ్వులు, గరికపోచలను సమర్పిస్తూ వేయి నామాలతో గణపతిని పూజించారు. బెల్లంతో చేసిన ఉండ్రాళ్లను నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): నూతన సంవత్సరం వేడుకల్లో పోలీసుల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్ అన్నారు. శనివారం పెనుమూరు పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం రాత్రి పదిగంటల తరువాత ఎవరూ గుంపులు, గుంపులుగా తిరగరాదన్నారు. రోడ్లపైన, వీధుల్లో కేక్‌లు కట్ చేయడం, మైక్ సెట్లు ఏర్పాటు చేసి రికార్డింగ్ డ్యాన్స్‌లు లాంటివి నిషేధమన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఆదివారం రాత్రి 10 గంటల తరువాత హోటళ్లు, టీ కొట్లు రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు వంటి వాటిని మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తుపాను బాధిత రైతులకు సబ్సిడీ విత్తనాలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన మండలంలోని ఎం.కొత్తూరు, ఓజీ కుప్పం ఆర్బీకే పరిధిలోని రైతులకు సబ్సిడీ విత్తనాలను మంత్రి ఆర్కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. శనివారం ఆర్బీకేల వద్ద బాధిత రైతులు 61 మందికి వేరుశనగ విత్తనాలు, 25 మందికి ఉద్దులు విత్తనాలను 80 శాతం సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ బాధితులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ రాష్ట్రంలో కరువుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబునాయుడు అయితే, వర్షానికి కేరాఫ్ అడ్రస్ వైఎస్సార్ కుటుంబమన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా ముందుకు వచ్చి ఆదుకోవడంలో జగనన్నకు ఆయనే సాటి అన్నారు. ఇటీవల ఇళ్లలోకి నీరు వచ్చి బాధపడిన 70 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఒక లీటరు పామోలిన్ ఆయిల్ అందించడం జరిగిందన్నారు. ఇంతటి మేలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాఘవేంద్ర యాదవ్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ డిల్లీ, ఎంపీటీసీ జ్యోతి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్‌లు నరసింహులు మోహన్, నాయకులు దామునాయుడు, జగదీష్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

కార్వేటినగరం: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆలయాల్లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నదాన కార్యక్రమానికి స్పందన వస్తోందన్నారు. టీటీడీ అధికారులు తిరుమల–తిరుపతి దేవస్థానంలో అనుసంధానంగా ఉంటున్న ఆలయాల్లో ప్రతి శుక్ర, శనివారాల్లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో దాతలు ముందుకు వచ్చి ప్రతి రోజు పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. స్థానికులు ఉపాధ్యాయ బృందం భక్తులకు అన్నదానం చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి దాతకు తీర్థ ప్రసాదాలను అందించినట్లు తెలిపారు.

రూ.8 కోట్లతో రోడ్డు నిర్మాణం



శరవేగంగా జరుగుతున్న కొత్తపల్లెమిట్ట రోడ్డు పనులు

వెదురుకుప్పం: ఎట్టకేలకు కొత్తపల్లెమిట్ట ప్రధాన రహదారికి మోక్షం లభించింది. దుస్థితిలో ఉన్న రోడ్డును బాగు చేసేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ చర్యలు తీసుకుంది. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడంతో రోడ్డు పనులను చకాచకా చేపడుతున్నారు. మండలంలోని పచ్చికాపల్లం నుంచి శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లెమిట్ట వరకు ఉన్న చిత్తూరు–తిరుపతి ప్రధాన రహదారి ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా తయారైంది. రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. స్థానిక ప్రజలు సమస్యను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో చర్చించారు. దీంతో అధికారులు పచ్చికాపల్లం నుంచి కొత్తపల్లెమిట్ట వరకు 26 కిలోమీటర్లను బాగు చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.8 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్డుకు నిధులు మంజూరు చేసి తారు రోడ్డు వేస్తుండడంతో సంతోషం వెలిబుచ్చుతున్నారు.

భూసారం ఆధారంగా పంటల సాగు



విత్తనకాయలు పంపిణీ చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: రైతులు భూసారాన్ని బట్టి పంటలను సాగు చేసుకోవాలని తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త వసుధ అన్నారు. శనివారం మండలంలోని ధర్మాచెరువు గ్రామానికి చెందిన 20 మంది రైతులకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద ధరణి రకం వేరుశనగ విత్తనకాయలు 30 కేజీల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి అందుకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. రైతులకు పంటల సాగుతో పాటు పంటలను తెగుళ్ల బారి నుంచి ఏవిధంగా రక్షించుకోవాలో సూచనలు, సలహాల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అలసంద విత్తనాలు 3.30 కేజీలు, జీవన ఎరువులైన ట్రైకోడెర్మా విరిడే పాస్ఫో బ్యాక్టీరియా వంటి ఎరువులను ఉచితంగా సరఫరా చేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త రూపేష్‌కుమార్ రెడ్డి, ఏఓ వనిత, రైతులు పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకలు ఇళ్లలోనే జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు: న్యూ ఇయర్ వేడుకలను ప్రతిఒక్కరూ తమ ఇళ్లలోనే జరుపుకోవాలని సీఐ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 31న జరుపుకునే వేడుకల్లో పోలీసుల నిబంధనలను అందరూ విధిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై బైక్ రైడ్స్, కేక్‌లు కట్ చేయడం, బాణసంచా పేల్చడం, పాట కచేరీలు నిర్వహించడం వంటివి చేయరాదని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లు నిర్ణీత సమయానికి మూసివేయాలని స్పష్టం చేశారు. సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు.

గంగాధరనెల్లూరులో..



మాట్లాడుతున్న ఎస్‌ఐ రామాంజనేయులు

గంగాధర నెల్లూరు: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీడీ నెల్లూరు ఎస్‌ఐ రామాంజనేయులు హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి 10 గంటల పైన గుంపులు గుంపులుగా తిరగడం, ఒకే ప్రదేశంలో ఉండడం చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి 10 గంటల తరువాత బార్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు మూసివేయాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో, అభ్యంతరకర, అసభ్యకరమైన అంశాలను, పోస్టు చేయవద్దని సూచించారు. ప్రజలు న్యూయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సూచించారు.

పోషకాహార పంపిణీలో నాణ్యత లోపిస్తే చర్యలు



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్

వెదురుకుప్పం: పోషకాహార పంపిణీలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని పచ్చికాపల్లం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు విధిగా పోషకాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని పిల్లలకు, బాలింతలకు సకాలంలో తప్పకుండా అందించాలన్నారు. మండలంలోని 72 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి 430 పోషకాహార కిట్లను అందజేసినట్లు చెప్పారు. పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. ప్రతిరోజూ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలని సూచించారు. నాణ్యత లోపిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, మహిళా సంఘ సభ్యులు సమన్వయంతో పని చేసి పోషకాహార పదార్థాలను సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార పంపిణీలో ఎక్కడా ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల, అంగన్‌వాడీ కేంద్ర ఇన్‌చార్జులు హారిక, సుదర్శన్, ఏఎన్‌ఎం సుధ ఉన్నారు.

లబ్ధిదారుల జాబితా విడుదల

వెదురుకుప్పం: వైఎస్సార్ ఆసరా కింద నాలుగో విడత లబ్ధి పొందనున్న 961 స్వయం సహాయక సంఘాలకు చెందిన లబ్ధిదారుల జాబితాను శనివారం వెదురుకుప్పం గ్రామ సచివాలయంలో డీడీఓ వెంకటేశ్ ఆవిష్కరించారు. మండలంలో మొత్తం 9,284 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు గాను రూ.9.71 కోట్లు మంజూరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం కవిత, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి

– సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: మానవ అక్రమ రవాణా, కల్తీ ఆహారాన్ని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్‌ను అలవాటు చేయరాదని, వారి పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై మరింతగా ఉందన్నారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాప్‌లు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణలో పోలీసులు తమవంతు పాత్ర పోషించాల్సి ఉందన్నారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, న్యాయవాదులు, మహిళలు పాల్గొన్నారు.

పథకాల పంపిణీపై సమీక్ష



పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రభుత్వ పథకాల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ప్రభుత్వం అందించే సంక్షేమాలను వివరించారు. జనవరి 1 నుంచి పింఛన్ పెంపులో భాగంగా రూ.3 వేలు అందించడం జరుగుతుందన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం 8వ తేదీ వరకు చేపట్టాలని, ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో అందించాలని కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా జనవరి 17వ తేదీ డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ నిధులు విడుదల అవుతాయన్నారు. ఈ కార్యక్రమం 30వ తేదీ ముగుస్తుందన్నారు. అలాగే 45– 60 ఏళ్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.18,700 నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందించే ప్రతి పైసా సకాలంలో లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని సంబంధిత అధికారుల బాధ్యతగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



మాట్లాడుతున్న విజయకుమార్ రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా నెరవేరుస్తున్న సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని సీఎం జగనన్నకు దత్తతకు ఇచ్చి అభివృద్ధి చేసిన ఘనత ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం సామాజిక వర్గాలకే కాకుండా అగ్రవర్ణాలకు చెందిన పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అందించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం ప్రజలకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ నాయకుల అబద్ధపు మాటలకు ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, యూత్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నీలాపండరీనాథ్, పూర్ణచంద్రారెడ్డి, దూది మునేంద్ర, బాబురెడ్డి పాల్గొన్నారు.

12వ తేదీలోపు సరుకుల పంపిణీ పూర్తి



డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహిస్తున్న డీటీ మహేష్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకులను 12వ తేదీలోపు సరఫరా చేయాలని డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణ డీలర్లు సంబంధిత ఎండీయూ ఆపరేటర్లకు నిత్యావసర సరుకులను కచ్చితంగా తూకం వేసి ఇవ్వాలన్నారు. సరుకుల సరఫరాను సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ఎండీయూ ఆపరేటర్లు 1వ తేదీ నుంచే పంపిణీ ప్రారంభించాలన్నారు. వలంటీర్ల సహకారంతో నిర్దేశించిన ప్రాంతంలో ఉదయం 7 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం వారు స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో 2024 యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న నూతన విద్యావిధాన్ని విద్యార్థులకు అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాబర్ట్, జయశంకర్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వెంకటేష్, జ్యోతి, మండల గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: 2024 నూతన సంవత్సరానికి సంబంధించిన యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శి ముని కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గణేష్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

రంగనాథరెడ్డి సేవలు ఎనలేనివి



రంగనాథరెడ్డి దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

పెనుమూరు(కార్వేటినగరం): మండల విద్యాశాఖ అధికారి రంగనాథరెడ్డి సేవలు ఎనలేనివని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. పెనుమూరు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రంగనాథరెడ్డి వలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి రంగనాథరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందించిన సహాయ సహకారాలు మరువలేనివని కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత రంగనాథరెడ్డి మాట్లాడుతూ రాయడం, చదవడం తెలిసిన వారు విద్యావంతుడు మాత్రమే అవుతాడని, కానీ ఎవరితో ఎలా మెలగాలన్న సంస్కారంతో చదువుకున్నవాడు, ఏ పని ఏ విధంగా చేయాలో తెలుసుకున్నవాడు విజ్ఞానవంతుడు అవుతాడన్నారు. అనంతరం రంగనాథరెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, అధికారులు శాలువలు కప్పి గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, ఎంఈఓ–2 భాస్కర్ నాయుడు, ఐరాల ఎంఈఓ సురేంద్రబాబు, పూతలపట్టు ఎంఈఓ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.